# తుప్ప పట్టిపోతున్నాయి..!


ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు


ఖాళీ స్థలంలో నిలిపిన కార్లు, ఆటోలు, బైక్‌లు

- పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు కలగని మోక్షం
- ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో గుట్టలుగా వాహనాలు

**ఆరిలోవ:** పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఏళ్ల తరబడి మోక్షం కలగడం లేదు. వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతూ తుప్పు పట్టిపోతున్నాయి. ఇలా ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో పలు వాహనాలు గుట్టలుగా పేరుకుపోయాయి. రోజురోజుకూ పోలీసులు పట్టుకున్న వాహనాలు ఇక్కడి స్టేషన్‌కు తరలించడంతో పేరుకుపోతున్నాయి. ఇక్కడ స్థలం చాలకపోవడంతో పోలీసులు ఎక్కడపడితే అక్కడ వాటిని నిలిపేస్తున్నారు. ఏళ్ల తరబడి పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడిన ఈ వాహనాలతో స్టేషన్ ఆవరణమంతా నిండిపోయి అస్తవ్యస్తంగా మారిపోయింది. నిజానికి ఈ స్టేషన్‌కు ప్రత్యేకంగా ఖాళీ స్థలం లేదు. స్టేషనే చిన్నది. దాని పక్కన జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలంలో ఈ స్టేషన్ పరిధిలో దొంగతనానికి గురై పోలీసులకు పట్టుబడిన వాహనాలు, రోడ్డు ప్రమాదానికి గురైన వాహనాలు పార్క్ చేస్తున్నారు. ఈ ఖాళీ స్థలం నుంచే 12వ వార్డుకు చెందిన రెండు సచివాలయాలకు ప్రజలు వెళ్లి రావాల్సి ఉంది. దీనిలో నిలిపిన వాహనాల కారణంగా ఆయా సచివాలయాలకు వెళ్లే దారి కూడా ఇరుకుగా మారింది. తప్పనిసరి పరిస్థితిలో ప్రజలు ఆ వాహనాల మధ్య నుంచే వెళ్లాల్సి వస్తోంది. సచివాలయాలకు వెళ్లావారి వాహనాలు అక్కడ నిలుపుకోవడానికి వీలుపడడంలేదు. దీంతో పాటు ఈ స్టేషన్ పక్కనే ఉన్న ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన కార్యాలయం ఆవరణం కూడా వాహనాల పార్కింగ్‌తో నిండిపోయింది. ఇక్కడ సుమారు 120 ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ఉన్నాయి. వీటిలో కొన్ని వాహనాలు సుమారు ఏడేళ్లకు పైబడి ఉండడంతో తుప్పుపట్టాయి. ఈ వాహనాలు ఇక్కడి నుంచి తొలగించి వేరేచోటకు తరలించాలని సచివాలయాలకు వెళ్తున్న ప్రజలు కోరుతున్నారు.

## వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- విస్తృతంగా వార్డుల్లో పాదయాత్ర


ఎంపీ ఎంవీవీని సత్కరిస్తున్న దాసు, పరసన్న తదితరులు


20వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

**ఎంవీపీ కాలనీ:** వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర ఆదివారం 19వ వార్డులో కొనసాగింది. యాత్రలో భాగంగా ఎంపీ.. 32వ రోజు 19వ వార్డులోని పెదజాలరిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఎంపీకి ఘన స్వాగతం పలికి, హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని పేద, వెనకబడిన వర్గాల ప్రజల కోసం సీఎం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వాటి ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు మరో సారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ దాసు, పరసన్న తదితరులు పాల్గొన్నారు.

**'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి**

**ఏయూ క్యాంపస్:** ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక 20వ వార్డులోని పలు ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించారు. పెద వాల్తేరు, కాగితాలవారి వీధి, మున్సిబ్ వారి వీధి, పలికిల వీధిలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. తన పాలన నచ్చితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని అడుగుతున్న దమ్మున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. తూర్పు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ వార్డు అధ్యక్షుడు రవికిరణ్‌రెడ్డి, మువ్వల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ ఉద్యోగులు

**మద్దిలపాలెం:** హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ మెయింటెనెన్స్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు ఉల్లాసంగా గడిపారు. సుదీర్ఘ కాలం నుంచి సేవలు అందించిన సీనియర్లు, విశ్రాంత ఉద్యోగులు తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. విధి నిర్వహణలో తాము ఎదుర్కొన్న అనేక సవాళ్లు, ఇబ్బందులు వివరించారు. ఈ సమావేశంలో జీఎంలు ఎస్‌హెచ్‌డీ ప్రసాద్‌రెడ్డి, ఎన్.మోహనరావు, ఇతర అధికారులు పి.జాన్సన్, సిహెచ్.చిరంజీవి, ఎస్.జనార్దనరావు, కె.గోపాలకృష్ణ, తిలోత్తమ్మ, కె.సత్యవతి, డి.ఎస్.వర్మ, తదితరులు పాల్గొన్నారు.

### శిష్టకరణ యువతకు అభినందన


జయలక్ష్మిని సత్కరిస్తున్న అనూష పట్నాయక్

**బీచ్ రోడ్డు:** నాలుగేళ్లుగా రోజూ ఏదో రూపంలో సామాజిక సేవ చేస్తున్న శిష్టకరణ యువతను రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ అభినందించారు. ఈ మేరకు ఆదివారం శిష్టకరణం యువత పుస్తకావిష్కరణ రామ్‌నగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి ఉద్యోగులకు డాక్యుమెంట్స్ రాస్తూ వారికి ఏరియర్స్ మంజూరులో కీలకపాత్ర పోషించిన బెహరా జయలక్ష్మిని ఘనంగా సత్కరించారు. శిష్టకరణం యువత రాష్ట్ర అధ్యక్షుడు మానాపురం సురేష్, శిష్టకరణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

### బహుముఖ ప్రజ్ఞాశాలి రాచకొండ నరసింహశర్మ


వందో జన్మదినోత్సవం జరుపుకొంటున్న పూర్వ విద్యార్థి రాచకొండ నరసింహశర్మ

**డాబాగార్డెన్స్:** ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు, కవి, రచయిత, అనువాదకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ శత జన్మదినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శర్మ వేడుకల్లో పాల్గొని ఆయన్ని ఘనంగా సత్కరించారు. వందో జన్మదినోత్సవం కళాశాలలో జరిపించడం ఆనందంగా ఉందని, రాచకొండను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ సాహితీవేత్త, బీవీకే కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ డీవీ సూర్యారావు మాట్లాడుతూ డాక్టర్ రాచకొండ నరసింహ శర్మ వ్యక్తిత్వం మహోన్నతమైనదని, సాహిత్య రంగంలో విశేష ప్రజాదరణ పొందారని కొనియాడారు. ప్రముఖ న్యాయవాది రాచకొండ ఉమాకుమార్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు నరసింహ శర్మ అడుగు జాడల్లో నడుస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ కిలారి గౌరీనాయుడు మాట్లాడుతూ శర్మ సేవలను కొనియాడారు. తెలుగు-ఆంగ్ల భాషలకు నరసింహ శర్మ వారధి వంటి వారని, శతాధిక ప్రసిద్ధ ఆంగ్ల కవులను తెలుగు వారికి పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు పి.వెంకటరత్నం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డి.గాయత్రి నరసింహమూర్తి, శ్రీనివాస్, అర్చన, స్వరాజ్యలక్ష్మి, పైడి రజని తదితరులు పాల్గొన్నారు.

## ఏయూ సమాచారం..

### ఎస్టీ కమిషన్ సభ్యుడు సందర్శన


ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌ని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఏయూలో విద్యార్థుల అభివృద్ధికి ఉపయుక్తంగా చేపడుతున్న నూతన ప్రాజెక్టుల ప్రగతిని వీసీ స్వయంగా వివరించారు. ఇటీవల ఏయూ జాతీయ స్థాయిలో నాక్ 3.74 గ్రేడింగ్ సాధించిందని తెలియజేశారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమంగా ఏయూ నిలవడంపై ఎస్టీ కమిషన్ సభ్యుడు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వడిత్యా శంకర్ నాయక్‌ను వీసీ సత్కరించారు.

### కామర్స్‌లో బమ్మిడి శిల్పకు డాక్టరేట్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థి బమ్మిడి శిల్పకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఆచార్య టి.సుబ్బారాయుడు పర్యవేక్షణలో 'హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్-ఏ కేస్ స్టడీ విత్ రిఫరెన్స్ టు సెలక్ట్ డిగ్రీ కాలేజ్ ఇన్ ప్రైవేట్ సెక్టర్, విశాఖపట్నం'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ఈ సందర్భంగా శిల్పను విభాగ ఆచార్యులు అభినందించారు.

**సివిల్ ఇంజినీరింగ్‌లో రేష్మకు..**

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని మలిపెద్ది రేష్మకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ డిసలూషన్ ఆఫ్ గ్రౌండ్ గ్రాన్యూలేటెడ్ బ్లాస్ట్ ఫర్నెస్ స్లాగ్ ఆన్ సిమెంట్ మోర్టార్ అండ్ కాంక్రీట్'అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చింది. ప్రస్తుతం సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా స్లాగ్‌ను వినియోగిస్తున్న విధానానికి భిన్నంగా తక్కువ స్లాగ్‌ని నీటిలో కరిగించి ఎక్కువ ధృఢత్వం తీసుకువచ్చే దిశగా ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను రేష్మ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు


రాజారావును సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

**విశాఖ విద్య:** ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో రాష్ట్రం నుంచి మొదటి బహుమతి సాధించిన జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు పి. రాజారావును ఘనంగా సన్మానించారు. సైన్సు పరిశోధనల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా, నిత్య విద్యార్థిలా సరికొత్త ప్రయోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర ఉపాధ్యాయులకు రాజారావు మాస్టారు కృషి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

**జిల్లా కార్యదర్శిగా పైడిరాజు**

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అడవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్న పైడిరాజు సేవలు జిల్లాలో మరింత వినియోగించుకునేలా కీలకమైన కార్యదర్శి పోస్టులో ఎంపిక చేశారు.

## రోటరీ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ జిల్లా-3020 అధ్యక్షుడు రోటేరియన్ సుబ్బారావు

**మద్దిలపాలెం:** సమాజంలో సాధికారతే లక్ష్యంగా రోటరీ క్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ జిల్లా-3020 అధ్యక్షుడు రోటేరియన్ రావూరి సుబ్బారావు తెలిపారు. స్థానిక కాకతీయ ఫంక్షన్ హాల్ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చాటర్‌నైట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన రోటరీ క్లబ్ అభాగ్యులు, అనాథలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది మానసిక ఆరోగ్యంపై దృష్టిసారించినట్టు ఆయన తెలిపారు. బాలికల సంక్షేమ హాస్టళ్లకు 4 వేల మేట్రిస్ పరుపులను పంపిణీ చేశామన్నారు. పోలియో రహిత సమాజం కోసం తమ వంతు కృషి చేస్తున్నామని, క్లబ్ ద్వారా రూ.5లక్షల విరాళం అందించామన్నారు. రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నాగరాజు, రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్ వి.బ్రహ్మానందం, కార్యదర్శి శంకరరావు, కోశాధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రేపు 'ఏపీ బాలల హక్కుల పరిరక్షణ' సదస్సు


మాట్లాడుతున్న కేసలి అప్పారావు, సీతారాం

**ఎంవీపీకాలనీ:** ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు వెల్లడించారు. ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఆదివారం కమిషన్ సభ్యుడి గొండు సీతారాంతో కలిసి ఆ వివరాలను వెల్లడించారు. మంగళవారం రాయల్ ఫోర్ట్ హోటల్లో ఈ ప్రాంతీయ సమావేశం జరుగుతుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణకై తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. స్త్రీ, శిశు సంక్షేమం, కార్మిక, విద్యా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటార్నారు.

## వైభవంగా సామూహిక సరస్వతి పూజ


సామూహిక సరస్వతి పూజ చేస్తున్న వేద పండితులు


పూజలో పాల్గొన్న విద్యార్థులు

**ఎంవీపీ కాలనీ:** సామూహిక శ్రీసరస్వతి పూజను విద్యార్థులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీసరస్వతి సహిత పంచాయతన యాగ మహోత్సవంలో భాగంగా ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా శ్రీశారదాంబ విద్యానికేతన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఎస్ఎస్‌వీ క్లాసెస్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంస్థ వ్యవస్థాపకుడు వి.సాయికాంత్‌శర్మ దంపతులు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆదివారం నగర విద్యార్థులతో సామూహిక శ్రీసరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం విద్యార్థులు ప్రదర్శించిన సప్తవాద్య తరంగిణి, కూచిపూడి నృత్యం ఆకట్టుకున్నాయి. నగరవాసులు, ఆధ్యాత్మికవేత్తలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న కేజీహెచ్ సిబ్బంది


అవగాహన కల్పిస్తున్న వాకర్స్ సభ్యులు

**బీచ్ రోడ్డు:** ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా కేజీహెచ్ అంకాలజీ విభాగం అధ్వర్యంలో ఆదివారం సాగర తీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ప్రారంభించారు. ఈ ర్యాలీలో 200 మందికిపైగా నర్సింగ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు..

**వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో..**

వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఏరియా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డీడీ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవనంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి నడకను నిత్య వ్యాయామంగా మలచుకోవాలన్నారు. ఆహార నియమాలు పాటిస్తూ సకాలంలో గుర్తించి ప్రారంభదశలో చికిత్స అందించడం ద్వారా క్యాన్సర్ మహమ్మారిని జయించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.రంగారావు, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆరిలోవ సీఐ గోవిందరావు


ఎంవీపీ కాలనీ క్రైమ్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ తదితరులు

**ఎంవీపీ కాలనీ:** నగరంలో ఎలాంటి నేరాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని ద్వారకా జోన్ క్రైమ్ సీఐ శ్రీనివాస్ పాత నేరస్తులను హెచ్చరించారు. ద్వారకా జోన్ పరిధిలోని ఎంవీపీ కాలనీ, ఆరిలోవ, ద్వారకా పోలీస్ స్టేషన్లలో వివిధ కేసుల్లోని పాత నేరస్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని క్రైమ్ స్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేడీ, డీసీ, సస్పెక్టడ్ షీట్లు ఉన్న పాత నేరస్తులకు నేరాల నియంత్రణకు సంబంధించి పలు హెచ్చరికలు చేశారు. ఎలాంటి నేరాల్లోను, వివాదాల్లోను తలదూర్చవద్దని సూచించారు. కుటుంబాలతో ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. కష్టపడి పనిచేసి కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు సమాజంలో బాధ్యత గల వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని సీఐ సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోను నేరాల జోలికి పోవద్దన్నారు. పాత నేరస్తులు మరోసారి నేరాలకు పాల్పడినట్లు తేలితే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ క్రైమ్ ఎస్ఐ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ:** ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో రౌడీ షీటర్లు మరింత జాగ్రత్తగా సత్ప్రవర్తనతో మెలగాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆరిలోవ సీఐ గోవిందరావు హెచ్చరించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్‌లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ.. అనంతరం మొదటిసారిగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రుషికొండ, ఎండాడ, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, డెయిరీఫారం, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలకు చెందిన 46 మంది రౌడీషీటర్లు, డెకాయిట్లు, సస్పెక్టెడ్ షీట్లు తెరిచినవారు ఉన్నారు. వారిలో కొందరు జైల్‌లో రిమాండ్‌లో ఉండగా.. మిగతా సుమారు 30 మంది వరకు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వారంతా ఏవిధంగా మెలగాలి, ఎంత జాగ్రతగా ఉండాలి తదితర వాటి గురించి సీఐ తెలియజేశారు. ఎలాంటి గొడవల్లోనూ కలగచేసుకోకూడదని సీఐ సూచించారు. సమాజంలో మంచిగా ప్రవర్తించకపోతే పోలీస్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 70 ప్యాకెట్ల గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

**సీతమ్మధార:** గుట్టుచప్పుడు కాకుండా పాడేరు నుంచి నగరానికి తరలిస్తున్న గంజాయిని స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సహకారంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఏపీ39 ఎన్‌క్యూ 2485 నంబర్ గల కారులో గంజాయి తీసుకొచ్చి నగరంలోని తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద పార్క్‌చేసి వెళ్లిపోయారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులతోపాటు ఏఎస్ఐ ఎం.గురునాథ్, హెడ్ కానిస్టేబుల్ కె.ఎ స్.నాయుడు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఒక వ్యాన్ సహాయంతో ఆ కారును ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అందులో 70 ప్యాకెట్ల గంజాయి(140 కిలోలు) ఉన్నట్లు గుర్తించారు. కారును సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు గుర్తించిన పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## బాలుడి అదృశ్యం


జి.యశ్వంత్

**మర్రిపాలెం:** కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న జి.యశ్వంత్ అనే బాలుడు 104 ఏరియా కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో తండ్రి జి.రవికుమార్ తన కుమారుడిని స్కూల్ వద్ద డ్రాప్ చేశాడు. తిరిగి సాయంత్రం ఇంటికి తీసుకొచ్చేందుకు వెళ్లగా.. ఎంతకీ బాలుడు బయటకు రాలేదు. దీంతో తండ్రి స్కూల్‌లో ఆరా తీయగా అసలు సదరు బాలుడు ఆరోజు స్కూల్‌కి రాలేదని వారు తెలిపారు. అంతటా గాలించారు. ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం ఫిఫ్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్. భాస్కర్‌రావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.